క్లుప్తంగా

విద్యార్థులు సేవా భావం పెంపొందించుకోవాలి



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవాభావం పెంపొందించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వాసర వేణి పర్శరాములు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ ఆవరణలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గోడలకు ప్రమాదకరంగా మారిన కొమ్మలను, గడ్డిపొదలను, ముళ్లకంచెలను తొలగించారు. పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకార దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

రుద్రంగి: మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం భవనంలో మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని గంగపుత్ర సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు ధర్మేందర్, ఉపాధ్యక్షుడు భూమయ్య, కార్యదర్శి రవి, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా కుమార్

ఎల్లారెడ్డిపేట: జిల్లా బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన మానుక కుమార్‌యాదవ్‌ను నియమిస్తూ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, మల్లికార్జున్, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మిల్లర్ల మాయాజాలం

- నిలువుదోపిడికి గురువుతున్న అన్నదాత
- క్వింటాలు ధాన్యానికి అదనంగా 5 కిలోల కోత



కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

ముస్తాబాద్: ''ఇక్కడ మిల్లర్లందరూ సిండికేట్‌గా మారారు. ధాన్యం తూకం వేసేటప్పుడు ఎంత తరుగు తీయాలనే విషయమై వీళ్లే నిర్ణయిస్తున్నారు. అధికారులను బుట్టలో వేసుకొని గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు.'' ఇది ముస్తాబాద్ మార్కెట్‌లో పరిస్థితి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హార్వెస్టర్ ద్వారా కోయించి, ధాన్యాన్ని తీస్తున్న విధానంలో ఎక్కడ పెల్ల, ఇతర వ్యర్థాలు రాకున్నా, అదనం తూకంతో పెద్ద ఎత్తున నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి సాగు, కోతలు, అమ్మకం వరకు ఏదోవిధంగా తాము నష్టపోతునే ఉన్నామని రైతులు వాపోతున్నారు.

10 వేల క్వింటాళ్ల ధాన్యం పక్కదారి

మండలంలో ఏటా 2.70 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం వస్తుంది. ఇందులో ముస్తాబాద్ ఐకేపీ ద్వారా 70 వేలు, పోతుగల్ ప్రాథమిక సహకార సంఘంలో 1.10 లక్షలు, ముస్తాబాద్ సహకార సంఘంలో 90 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రతి సీజన్‌లో సేకరిస్తున్నారు. ఇందులో 40 కిలోల ధాన్యం బస్తాకుగాను 42.50 కిలోల ధాన్యాన్ని తూకం వేస్తున్నారు. రైతులకు మాత్రం 40 కిలోల ధాన్యాన్ని లెక్కగట్టి, ట్రక్ షీట్లు ఇస్తున్నారు. దీంతో క్వింటాలుకు దాదాపు 5 నుంచి 66 కిలోల ధాన్యాన్ని రైతు నష్టపోతున్నాడు. ఇందులో సంచి బరువు 700 గ్రాములు పెట్టుకున్న, 1800 గ్రాముల ధాన్యాన్ని నష్టపోతున్నారు. ఈ లెక్కన 10 వేల క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రతి సీజన్‌లో ఇదే వరుస..

ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,203 ఉండగా 10 వేల క్వింటాళ్ల ధాన్యానికి లెక్కలేదు. ఇదంతా మిల్లర్లకే చేరుతుందని పేర్కొంటున్నారు. దీంతో రూ.22 లక్షలకు పైగా నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. ధాన్యం దోపిడి విషయం కిందిస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు తెలిసినా ఎక్కడ దీనిపై నియంత్రణ లేకపోవడం గమనార్హం. ఇదంతా బహిరంగ రహస్యమేనని ఆ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. అధికారులను ఎలాగోలా మేనేజ్ చేస్తూ తమ పొట్ట కొడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో ముస్తాబాద్ మండలంలో 3 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరిస్తున్నారు. కొద్ది సంవత్సరాలుగా ప్రభుత్వం స్థానిక మిల్లర్లకే ధాన్యాన్ని కేటాయించడంతో, దోపిడీ యథేచ్ఛగా సాగుతుందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. పొల్లు పేరుతో మిల్లర్లు 41 కిలోలకు బదులుగా సంచి బరువు పోను 42.50 కిలోలు తీసుకుంటున్నారు. ధాన్యాన్ని శుద్ధి చేసిన రైతుల వద్ద సంచికి 41 కిలోలు తూకం వేస్తున్నారు. అయితే 90శాతం మంది రైతులు శుద్ధి చేయకపోవడంతో 42.50 కిలోలకు అంగీకరిస్తున్నారు. ఏఈవోలు ధ్రువీకరించినా పొల్లు పేరుతో కోతలు విధిస్తున్నారని రైతులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో ఏఈవోలు కనిపించకపోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. కొంతమంది మిల్లర్లు 42.50కు ఒక్క గ్రాము కూడా తగ్గడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వచ్చిన రైతులకు న్యాయం చేసే వారు లేరు.

హమాలీ చార్జీలు అదనం

ఒకవైపు పొల్లు పేరుతో సంచికి 2.5 కిలోల ధాన్యాన్ని నష్టపోతున్న రైతులకు హమాలీ చార్జీ పేరుతో క్వింటాలుకు రూ.45 వసూలు చేస్తున్నారు. పదేళ్ల క్రితం ప్రభుత్వమే రైతులకు హమాలీ చార్జీలను చెల్లించేది. ఇప్పుడా విధానం ఎక్కడ కనిపించకుండా పోయింది.

ఆరు కిలోలు కట్ చేసిన్రు



నేను కొనుగోలు కేంద్రంలో 126 క్వింటాళ్ల వడ్లు అమ్మిన. నాకు 6 క్వింటాళ్ల ధాన్యం కోత విధించారు. ఇదేందీ అంటే వడ్లను జాలీ పట్టలేదు అన్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారారు. బస్తాకు 42.50 కిలోలు జోకారు. దీంతో నాకు రూ.14 వేల నష్టం జరిగింది. – కుంబాల రాజిరెడ్డి, రైతు

ఆరబెట్టుడు తప్పింది



మాకు మూడు ఎకరాలు ఉంది. కేంద్రంలో జాలీ పట్టుడు, ఆరబెట్టడం, రోజు కవర్లు కప్పుడు తప్పింది. మేమే 42.50 కిలోలకు ఒప్పుకున్నాం. లేకపోతే ఇక్కడ చాలా రోజులు ఆగాల్సి వుంటుంది. ఇవన్నీ బాధలు పడలేక అమ్ముకుంటున్నం. – దున్నపోతుల రాజవ్వ, రైతు, పోతుగల్

పరస్పర అంగీకారం మేరకే..



రైతులు, మిల్లర్ల పరస్పర అంగీకారం మేరకే క్రయవిక్రయాలు సాగుతున్నాయి. ధాన్యం శుద్ధిచేస్తే 41 కిలోలు తూకం వేయిస్తున్నాం. జాలీ పట్టకుండా విక్రయిస్తున్న ధాన్యాన్ని మిల్లర్లు 42 కిలోలకు పైగా తీసుకుంటున్నారు. జాలీ పట్టిన ధాన్యానికి బాధ్యత వహిస్తాం. – జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

- బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనరసింహారావు



కిష్టంపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

చందుర్తి: అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట, రామారావుపల్లె, ననుగుల, దేవుని తండా, జలపతి తండా, కట్టలింగంపేట, లింగంపేట, జోగాపూర్, అనంతపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి వారికి ఓట్లు వేసి మోసపోతే, బతుకులు ఆగమవుతాయన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రారంభించి, అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. మరింత అభివృద్ధి జరగాలన్న, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మూడోసారి కేసీఆర్‌ను సీఎం గెలిపించుకునే బాధ్యత మీపై ఉందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించుకుంటే, సీఎంగా కేసీఆర్ గెలుస్తాడన్నారు. రైతును రాజుగా చూడాలనే సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తుంటే, కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటుకు 10 హెచ్‌పీ మోటారుతో నీళ్లు పారించుకోవాలని చెబుతున్నారు. కరెంటు ఇచ్చే సీఎం కేసీఆర్ కావాలో, కరెంటు కోతలు పెట్టే కాంగ్రెస్ కావాలో మీరే ఆలోచించుకోవాలన్నారు. ఈ ప్రచారంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల ఆశోక్, కొమ్ము రమేశ్, సర్పంచులు లింగంపల్లి కరుణాకర్, ఆయిలేన్ని కమలాకర్, దప్పుల లక్ష్మి, ఏనుగుల జమున పాల్గొన్నారు. చందుర్తి మండలం రామారావుపెల్లికి చెందిన అంబేద్కర్ సంఘం 150 మంది సభ్యులు, కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు.

భార్య, కూతురు ప్రచారం

వేములవాడ: వేములవాడలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ భార్య సునీల మంగళవారం ఇంటింటికి తిరుగుతూ బొట్టుపెట్టి ఓట్లను అభ్యర్థించారు.



ప్రచారంలో పాల్గొన్న చల్మెడ సతీమణి సునీల

కథలాపూర్: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో చల్మెడ కూతురు నివేదిత ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, సర్పంచ్ పోతు సింధూజ, నాయకులు నస్కూరి భాస్కర్, తిరుపతి, సాగర్ పాల్గొన్నారు.

డెయిరీ చైర్మన్ ప్రచారం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రిలో భాషానాయక్ తండాలో కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు ప్రచారం చేశారు.

ఇంటింటి ప్రచారం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడి ఇంటింటా ప్రచారం చేశారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో సర్పంచ్ కొక్కుల భారత, గ్రామశాఖ అధ్యక్షుడు జవ్వాజి మల్లయ్య, నాయకులు శ్రీనివాస్, రవి, మల్లారెడ్డి, లక్ష్మణ్, రమేశ్, రాములు ప్రచారం చేశారు.

సైనికుల్లా పని చేయాలి

రుద్రంగి: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, కో ఆప్షన్ మెంబర్ జెమీలా బేగం, సెస్ డైరెక్టర్ గంగారాం, చల్మెడ కూతురు నిహారిక పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వండి

- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



కోనరావుపేట: మరిమడ్లలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ నియోజవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మరిమడ్లలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనరావుపేట మండలం కోనసీమలా మారిందని మంత్రి కేటీఆర్ సాక్షాత్తు అసెంబ్లీలో అబద్ధమాడారన్నారు. అబద్ధాల హామీలతో గెలిచిన ఎమ్మెల్యే పరాయి దేశంలో ఉండి పాలన సాగించారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు మల్లేశం సింగం నారాయణ పాల్గొన్నారు.

మీ బిడ్డనై వస్తున్న ఆశీర్వదించండి

మేడిపల్లి: మీ బిడ్డనై వస్తున్న ఆశీర్వదించండి అని ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొండాపూర్, కాచారం, వెంకట్రావుపేట, కమ్మరిపేట, భీమారం, దేశాయిపేట, లింగంపేట గ్రామాల్లో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. నరేశ్‌రెడ్డి, రేండ్ల మధు, వంగ లింగం, చుక్క తిరుపతి, సాయిని గంగరెడ్డి, తక్కురి తక్కయ్య, చాందు, జీవన్, ప్రశాంత్ పాల్గొన్నారు.



మేడిపల్లిలో యువతికి హైఫై అంటున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి: మండల కేంద్రంలో డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్ పాల్గొన్నారు.

మేడిపల్లిలో వికాస్‌రావు ప్రచారం



వికాస్‌రావుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలంలోని మాచాపూర్, వల్లంపల్లి, కల్వకోట, దమ్మన్నపేట, మన్నెగూడెం, లింగంపేట, దేశాయిపేట, గోవిందారం, మోత్కురావుపేట, పసునూర్, రాజలింగంపేట, మేడిపల్లి గ్రామాల్లో వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు సుడిగాలి పర్యటన చేశారు. బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన తర్వాత మొదటిసారిగా మండలానికి రావడంతో బీజేపీ శ్రేణులు, మహిళలు, యువ కులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. దమ్మన్నపేట, గోవిందారం గ్రామాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. క్యాతం దశరథ రెడ్డి, మహేందర్‌రెడ్డి, మధుకర్, జలపతిరెడ్డి, మనోజ్‌రెడ్డి, తొగరి లక్ష్మీపతి, ఇజ్రయిల్, రఘు, మహేశ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, నిజామాబాద్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ బొట్టు పెడుతూ మహిళలను ఓట్లు వేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ గోపాడి జ్యోతి, మాజీ వైస్‌ఎంపీపీ అంబోజి లక్ష్మీనారాయణ, నాయకులు బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, పోగుల లచ్చిరెడ్డి, నాయిని రాంరెడ్డి పాల్గొన్నారు.



కోనరావుపేట: కనగర్తిలో నాయకుల ప్రచారం

నేతన్నలు సాంచాలు అమ్ముకుంటున్నారు

- సిరిసిల్లకు 'పవర్‌లూమ్ క్లస్టర్' సాధిస్తా
- సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ



సిరిసిల్ల నేతన్న సాక్షిగా బాండ్‌పేపర్‌ను విడుదల చేస్తున్న రాణిరుద్రమ

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట: సిరిశాలగా ఉన్న సిరిసిల్ల నేతన్నలు తుక్కుకింద సాంచాలు అమ్ముకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కొత్త బస్టాండు నుంచి పాదయాత్ర చేసి, నేతన్న విగ్రహం వద్ద ఆమె మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ వస్త్రపరిశ్రమకు శాశ్వత పరిష్కారం చూపకుండా పరిశ్రమను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. 2003లో అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్క్‌ను మంజూరు చేస్తే, అది ఇప్పుడు మూతపడే స్థితికి చేరిందన్నారు. నేతన్న విగ్రహం సాక్షిగా బాజాప్తా బాండ్ పేపర్ రాసిస్తున్న.. సిరిసిల్లకు 'పవర్‌లూమ్ క్లస్టర్' సాధిస్తానని ఆమె స్పష్టం చేశారు. నూలు డిపోల ఏర్పాటుతో పాటు, వస్త్రపరిశ్రమలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. సిరిసిల్ల ప్రజలు ఆశీర్వదిస్తే ప్రధాని మోదీ, ఎంపీ బండి సంజయ్ సహకారంతో సిరిసిల్ల నేతన్నల భవిష్యత్‌కు భరోసా కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి, దుమాల, కోరుట్లపేటలో పాదయాత్ర నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు గోపి, వేణు, చందు, దేవేందర్‌రెడ్డి, మానుక కుమార్‌యాదవ్, సాయికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

- మానకొండూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ



తిమ్మాపూర్: కొత్తపల్లిలో మాట్లాడుతున్న మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం/తిమ్మాపూర్: దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ కోసం రాష్ట్రంలో నియంత కేసీఆర్ పాలన అంతం కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కలవేని శంకర్ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో గుంటి వేణు అధ్యక్షతన నియోజకవర్గ సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలవేని శంకర్‌తో పాటు ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి మరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, మండల కార్యదర్శి బోయిని తిరుపతి, నాయకులు పవన్, కేదారి, అశోక్, వెంకట్ రెడ్డి, సమ్మయ్య, అంజిరెడ్డి, యుగేందర్, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిరపాలన సాధ్యం

కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణకు మద్దతుగా నాయకులు గన్నేరువరంలో మంగళవారం గడప గడపకు ప్రచారం చేశారు. ఈ కాంగ్రెరస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌తో సుస్థిర పాలన సాధ్యమని, బీఆర్ఎస్, బీజేపీలను నమ్మొద్దన్నారు. రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళిత బంధు పథకాల అమల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు నల్లా చంద్రారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, కవ్వంపల్లి రాజయ్య, జీల ఎల్లయ్య, బుర్ర మల్లేశం, మీసం రాములు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కమీషన్ల పార్టీ

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ కమీషన్ల పార్టీ అని రాయచూర్ ఎమ్మెల్యే బసవా గౌడ ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తామన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కవ్వంపల్లి సత్యనారయణ సతీమణి డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో మోడల్ బ్యాలెట్ చూపిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసవాగౌడ

కరాటే శిక్షణ ప్రారంభం



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కోనరావుపేట: మండలం నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులను ప్రధానోపాధ్యాయుడు షాబొద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ అవసరమన్నారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా కరాటే శిక్షణ పొందాలన్నారు. కరాటేతో ఆత్మరక్షణ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ మంగళగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలో ఆత్మహత్యకు పాల్పడిన నక్క శ్రీనివాస్ అనే పెయింటింగ్ కార్మికుడి కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్‌తో పాటు పలువురు దాతలు రూ.15 వేలు, 50 కిలోల బియ్యాన్ని మృతుడి భార్య, పిల్లలకు మంగళవారం అందించారు.

పాఠశాలలో స్వయంపాలన



సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గన్నమనేని శ్రీనివాసరావు, ద్యావనపల్లి పరమేశ్వర్, సలావుద్దీన్ పాల్గొన్నారు.

కష్టపడి చదువుకోవాలి

కోనరావుపేట: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు కష్టపడి చదువుకుని విద్యలో రాణించాలని ఏఎస్‌డబ్ల్యూవో విజయలక్ష్మి అన్నారు. కోనరావుపేట మండలంలోని ధర్మారం ఎస్సీ వసతి గృహం విద్యార్థులకు పెన్సిళ్లు, స్కేళ్లు, కంపాస్‌బాక్స్, స్వెటర్లు, బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు, రెండు జతల షూలు పంపిణీ చేశారు. వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు అన్ని రకాల వసతులు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ కోయల్‌కార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.